రాధారాణి

ఆర్. వి. జి. కృష్ణమూర్తి

అప్పుడే వచ్చిన టపా చూడటం ప్రారంభించిన హెడ్‌మాస్టరు, పరంధామయ్యగారు "ఇవన్నీ మామూలే. ఏమీలేదు" అన్నట్టు చూచిపారేశాడు. కానీ, ఆ ఒక్కటే... ఆఖరు కవరు మాత్రం పరంధామయ్యని అలా వదల్లేదు. దాన్లోని ఉత్తరం చూట్టంతోటే పరంధామయ్యకు సంభ్రమమూ, ఆశ్చర్యమూ కలిగాయి. దాన్ని మళ్ళీ పైనుంచి క్రింది వరకూ చదివాడు. మరోసారి నవ్వుతూనే పెద్దగా చదివాడు. కళ్ళద్దాలు తీసి, కాగితాన్ని పరీక్షించి, కళ్ళు నలుపుకుని, మళ్ళీ జోడు పెట్టుకుని ఆఖరిసారిగా చదువుకుని, మిగతా టపాలోంచి దాన్ని వేరుచేసి, తాపీగా ఆలోచించుకుని, హడావుడిగా టేబుల్ మీది బెల్ నొక్కి, గట్టిగా 'ప్యూన్' అని కేకేశాడు. హెడ్‌మాస్టరు ఎంత పెద్దగా, హడావుడిగా, తీవిగా కేకేశాడో, అంత నెమ్మదిగా, నిదానంగా, తూగుతూ, "సార్" అంటూ వచ్చాడు ప్యూన్.

"ఒరేయ్. మన స్టాఫ్ మెంబర్లనందర్నీ నేను పిలుస్తున్నానని అర్జెంటుగా రమ్మని చెప్పు—"

"అందర్నీ రమ్మంటారా సార్?"

"అవున్రా. అందర్నీ...కాదుకాదు... సీనియర్ అసిస్టెంట్లనీ, తెలుగు పండిట్‌నీ రమ్మను...ఊ...త్వరగా..." తూగుతూ వెళ్లాడు ప్యూన్. నాలుగు నిమిషాలసేపు కుర్చీలో చేరగిలబడి పైకప్పుకేసి చూస్తూ ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ననుభవిస్తూ అలాగే కూర్చుండిపోయాడు హెడ్ మాస్టరు పరంధామయ్య. ఐదో నిమిషానికి తెలుగు పండితుడు నరసింహశాస్త్రి, సోషల్ స్టడీస్ టీచరు మధుసూదనరావూ, సైన్సు టీచరు చలపతిరావూ, లెక్కల మాస్టరు రామలింగం, ఇంగ్లీషు మాస్టరు గోపాలకృష్ణ వగైరాలంతా వచ్చి కూర్చున్నారు.

ఈ అత్యవసర సమావేశానికి అధ్యక్షత వహించిన హెడ్‌మాస్టరు పరంధామయ్యగారు లేచి, "ఈ రోజు చాలా సుదినం. ఎందుకంటే, యింతవరకు యీ పాఠశాల ప్రారంభించిన తర్వాత, యిలాంటి విషయం ఎన్నడూ జరుగలేదు. సరి క్రొత్త సమాచారాన్ని మీ కందచేయబోతున్నాను,"

మాస్టార్లు ఒకరిముఖం ఒకరు చూచుకున్నారు.

"ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలని మీకందరికీ ఆతురతగా వుంది కదూ! అదే. చెప్పబోతున్నాను. మనస్కూలుకు ఒక అమ్మాయిని టీచరుగా వేశారు. ఆ అమ్మాయి పేరు..." కొంచెం ఆగి, కవర్లోంచి ఉత్తరం తీసి చూచి "కుమారి రాధారాణి. బి. ఏ. బి. ఇడి...ఆమె తక్షణం వచ్చి జాయిన్ కాబోతూంది. బహుశా సోమవారంనాడు రావచ్చు...

* * *

"కుమారి రాధారాణి ... ఎవరీ రాధారాణి?...బహుశా ఆమేనా!...ఏమో!!..." అనుకుంటూ ఇంగ్లీసు మాస్టరు గోపాలకృష్ణ ఆలోచనా సముద్రంలో మునిగి పోయాడు.

* * *

"రాధారాణి... — తనూ, ఆమే ఒకే కాలేజిలో చదివేవాళ్లు. తనకంటే రెండేళ్లు జూనియరు ఆమె. కాలేజిలో అందరికంటె అందగత్తె. తన అందానికి తనే మురిసిపోతుండేది. సౌందర్యగర్వం ఆమెలో తొణికిసలాడేది. అందర్నీ నిర్లక్ష్యం చేసేది. ఆమె అనుగ్రహం కోసం, ఆమె చల్లని చూపు కోసం, కనీసం ఆమెమీదినుంచి ప్రసరించే గాలి కోసం, దీపంచుట్టూ తిరిగే పురుగుల్లాగా తహతహలాడుతూ, తనని వెన్నాడే విద్యార్థులను బలాదూరుచేసి ఎన్నో అవమానాలకు గురయ్యేట్టు చేసేది.

ఆమెతండ్రి నూలు వ్యాపారస్తుడు. లక్షాధికారి. లేక లేక కలిగిన ఒకేఒక బిడ్డవడంవల్ల అతి గారాబంగా పెరిగింది. జపాన్ చక్రవర్తికూతురు అలా పెరిగివుండదు. రాక్‌ఫెల్లరు మనుమరాలు ఆమురిపాలు పోయివుండదు. అందం, డబ్బు, చదువు, అన్నీవున్నాయి కాబట్టే రాధారాణికి కన్నూ, మిన్నూ కనుపించలేదు. సౌందర్యం లోపించిన తోటి స్త్రీలనుగూడా అవమానపరచేది. ప్రతి మగాడు తన అందాన్ని చూచి, తనకి దాసుడైపోతాడని ఆమె భావన. అందుకు తగ్గట్టే విద్యార్థి సమూహం ఆమెకై పడిగాపులు గాచేది.

రంభ, ఊర్వశి, మేనకలుగూడా ఆమ ముందు ఎందుకూ కొరగారనీ, బ్యూటీ కాంపిటీషన్‌లో వాళ్ళతో పోటీచేసి గెలువగల ధీమా తనకుందనీ, ఆమె కొందరి స్నేహితురాళ్ళతో ఢంకామీద దెబ్బకొట్టినట్టు చెప్తూండేప్పుడు, గోపాలకృష్ణ లేడీస్ వెయిటింగ్ రూము ముందునుంచి వెళ్తూ స్వయంగా విన్నాడు. విన్నవాడు విన్నట్లుగానే వెళ్లక "ఎవరీమె?" అన్నట్లుగా అటువైపు తిరిగి చూచాడు.

ఆమాపును రాధారాణి చూపు ఎదుర్కొంది. అంతే......తలవంచుకు వెళ్ళిపోయాడు. ఆ చూచిన క్షణంసేపట్లోనే గోపాలకృష్ణ హృదయంలో పెద్దజ్యోతి వెలిగింది. కాని ఆమెమాటలు జ్ఞాపకం రావడంతో ఆజ్యోతి కాస్తా 'ఠక్' మని ఆరిపోయింది. రాధారాణికిగూడా "యితనెవరా?" అన్న ప్రశ్న పుట్టుకొచ్చింది. "తనలోవుండే జాడీగార్డ్సులో యితన్నెప్పుడూ చూళ్ళేదే! ఏం చదువుతున్నాడు? చూచిగూడా ముఖంతిప్పుకు వెళ్ళిపోయాడే! సిగ్గుపడ్డాడా!!...లేక భయపడ్డాడా!!!" అని ఆలోచించుకుంటూ వెళ్ళింది.

పరీక్షలన్నీ అయిపోయాక, గోపాలకృష్ణ సినిమాకెళ్ళి వస్తూంటే వెనకాల్నుంచి ఓకారువచ్చి ప్రక్కన్నే సడన్‌గా ఆగింది. కార్లోంచి ఆ అమ్మాయి తలుపుతెరచుకుని "గోపాలకృష్ణగారూ! పాపం నడచి వెళ్తున్నారు. వచ్చి కారెక్కండి. మిమ్మల్ని దిగబెట్టి వెళ్తాను" అంది.

"అక్ఖ్ఖె అక్కర్లేదండీ నడిచెవెళ్తాను. నాకలవాటేగా! మీరెళ్ళండి. చాలా థాంక్స్." అని తప్పించుకోబోయాడు గోపాలకృష్ణ.

"ఫరవాలేదు. ఎక్కండి," అంటూ కారు దిగివచ్చి చెయ్యిబట్టుకుంది.

ఆ సుకుమారమైన వేళ్ళు తగలడంతో గోపాలకృష్ణకు "యిది కలా, నిజమా" అనిపించింది. కాని, ప్రత్యక్షంగా కనబడ్తూంటే యిది కలని నమ్మలేక, నిజమేనని నిశ్చయించుకున్నాడు. రాధారాణి తనని కారెక్కమని బలవంతం చేయడమేమిటి?— అందులోనూ చెయ్యిబట్టుకు లాగడమేమిటి?—ఇక మొగమాటమిబాగుండదని కార్లో వెనకసీటులో కూర్చోబోయాడు.

"ఆ. ఆ... అలా కాదు...యిక్కడ

కూర్చోండి" అంది తనప్రక్కనే స్థలం చూపిస్తూ రాధారాణి.

ఆ అందాలబరిణె సరసన కూర్చుని కార్లో వెళ్తూంటే గోపాలకృష్ణ పుష్పకవిమానమెక్కి బొందితో స్వర్గానికెళ్తూన్నట్టు ఫీలయ్యాడు.

కారు నేరుగా గోపాలకృష్ణ రూముదాటి పార్కువైపు వెళ్ళింది. కారునిలిపి, పార్కులోకి దారితీసింది రాధారాణి. మంత్రముగ్ధుడిలా అనుసరించాడు గోపాలకృష్ణ.

లోపలి కెళ్ళడంతోటే "ఏవండీ, నేనందంగా లేనూ?" అని ప్రశ్నించింది రాధారాణి. తలవని తలంపుగా వచ్చిన యీ ప్రశ్నకు ఏమని జవాబివ్వాలో అర్థంగాక వెర్రిగా చూస్తూ అలా నిల్చుండిపోయాడు.

మళ్ళీ అదేప్రశ్న అడిగింది రాధారాణి.

"ఏవండీ, నేనందంగా లేనూ?"

"లేవని ఎవరన్నారు?" ముక్తసరిగా జవాబిచ్చానని మురిసిపోయ్యాడు గోపాలకృష్ణ.

"మీరు చెప్పండి మీకళ్ళకి అందంగా వున్నానా?"

"కాదని నేననడం లేదుగా!"

"అంటే నేనందంగా వున్నానని మీరు ఒప్పుకుంటారా?"

"నేను ఒప్పుకోవడ మెందుకు? మీరు అందగత్తె అని కాలేజీ అంతాఘోషిస్తూంటే నేను ఒక్కడ్నీ మీరు అందగత్తె కావంటే ఎవరైనా నమ్ముతారా? లోకం నన్నో వెధవ క్రింద జమకట్టేయదూ?"

"లోకం కోసం మీరు నన్ను అందగత్తె నంటారు. కాని మీదృష్టిలో నేను అందగత్తెను కానన్నమాట." కండ్ల నీళ్ళు వచ్చాయి రాధారాణికి. ఆసంగతి గోపాలకృష్ణ గమనించకుండానే యీసారి ఘాటుగా జవాబివ్వాలనుకున్నాడు.

"నేనలాగని ఖచ్చితంగా చెప్పలేను రాధారాణిగారూ. మీరు అందగత్తె లన్న మాట వాస్తవమే. కాని, స్త్రీకి సహజమైన "సిగ్గు" అందాన్ని యినుమడింప జేస్తుంది. ఆడది సిగ్గుఅనేది కించిత్తయినా లేకుండా, నేనందగత్తె ననుకుంటూ, ఎగబడి వీధిని తిరగటం మూలాన్ని సహజమైన అందం గూడా దెబ్బతింటుంది—ఇది నా స్వంత అభిప్రాయమే రాధారాణిగారూ. క్షమించండి. మీరు అందత్తెలు కారని నేననలేను."

రాధారాణి కన్నీరు చెంపలమీదుగా జారిపోతోంది. పరిపూర్ణ యౌవనంతో మిలమిల మెరిసిపోతున్న ఆయువతిని లైట్ల వెలుగులో చూచాడు. గోపాలకృష్ణ చలించిపోయాడు.

"ఏమి యీమె అందం! ఇలాంటి సౌందర్యవతికి గాక గర్వం మరెవ్వరికుంటుంది? పాపం. నామాటవల్ల ఎంత బాధపడిందో—రాధారాణిగారూ—"

"చాలు. మీరు నన్నింతగా అవమానించారు. వెళ్ళొస్తాను. నమస్తే—" అంటూ వడివడిగా వెళ్ళిపోయింది. దిగ్భ్రాంతుడై వున్నచోటనే నిల్చుండిపోయాడు గోపాలకృష్ణ. కొంచెంసేపటికి కారు బయలేరిన శబ్దం వినవచ్చి మళ్లీ యీలోకంలోపడి, నడిచి రూముకు చేరుకున్నాడు.

*　　*　　*

"ఆ రాధారాణేనా యీమె. ఆమే అయితే ఈ స్కూలు మాస్టరుద్యోగానికి ఎందుకు వస్తుంది? లక్షాధికారి బిడ్డకు యీ వుద్యోగాలెందుకూ?"...ఈ ఆలోచనలతో ఆరాత్రి నిద్రపట్టలేదు గోపాలకృష్ణకు.

*　　*　　*

తెలుగుమాష్టరు నరసింహశాస్త్రి భార్యపోయి సంవత్సరం దాటింది. అంటే ఆమె యీ లోకాన్నే విడిచిపోలేదు. ఒక్క తెలుగు మాస్టార్నీ, ఆవూరిని విడిచి జట్కాబండితోలే చెంగయ్యతో పట్నంలో వుంటుంది. ఆమె పోయినరోజునుంచి తెలుగు మాస్టారుకి చేతులు కాల్తున్నాయి. భార్యపోయిన తర్వాత అతనికి కష్టమనిపించే పనుల్లో యీవంట జేసుకోడమే ముఖ్యమైనది.

ఈనాడు ఒక ఉపాధ్యాయిని తమ స్కూల్లో చేరబోతోందంటే సంతోషపడి, ఎగిరి గంతేసినవాళ్లలో తెలుగుమాస్టారే ప్రథముడు. ఇంటికిపోయి జంధ్యాలు చిక్కు విడదీస్తూ సంతోషంతో ఆలోచించుకోవడం మొదలెట్టాడు.

"కుమారి రాధారాణి...పెండ్లిగాలేదేమో పాపం. కుమారిగానే వుండిపోయింది. ఏమైనాగాని మిగతా ఉపాధ్యాయులూ, విద్యార్థులూ, మరీ తన్ను లెక్కజేయడమే లేదినున్న. ఈమెవద్ద కొంచెం బెట్టుసరిగా వుండాలి. మొన్న—ఓ స్కూల్ ఫైనల్ కుంక నన్నుజూచి 'జట్కావాలా' అని కూస్తాడు. ఆ ముండె జేసిన వెధవముండాపనికి నేను తలెత్తుకోలేకుండా వున్నాను. యీ అమ్మాయి గనక నాకు యీడుసరిపోతే హెడ్‌మాస్టరుగారితో మాట్లాడి ఆమూడు ముళ్ళూ పడేస్తాను" అనుకుంటూ కాలం గడిపాడు. ఇలా ఎన్నోసార్లు ఎందరో్ని చూచి పెండ్లిచేసుకోవాలనుకున్నాడు. కాని ఒక్కటీ కలిసిరాలేదు. అందుకనే తెలుగు మాస్టారి ద్వితీయవివాహం వాయిదాలు పడిపోయింది.

అంతా ఎదురుచూచిన సోమవారం రానే వచ్చింది. పదిగంటలప్రాంతంలో ఓఅమ్మాయి గేటుదాటి లోపలికొస్తూంది. స్టాఫు రూములో టీచర్లు కిటికీల్లోంచి చూస్తున్నారు. ఆ అమ్మాయి నేరుగా హెడ్‌మాస్టరు రూంలోకెళ్లింది.

కొంతసేపటికి హెడ్‌మాస్టరూ, ఆమె కలిసి స్టాఫురూంలోకి రావడంతో, ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్న టీచర్లంతా లేచి నిల్చున్నారు. గోపాలకృష్ణ మాత్రం అప్పటికింకా రాలేదు.

"ఈమె కుమారి రాధారాణిగారు. మన స్కూలుకు క్రొత్తగా వచ్చిన టీచరు," అని హెడ్‌మాస్టరు టీచర్లందర్ని పరిచయం చేయడం ప్రారంభించాడు. పరిచయం చేయడమైపోయాక వెళ్లిపోబోయారు, హెడ్‌మాస్టరూ, రాధారాణి. కాని గోపాలకృష్ణ అప్పుడే రావడంమూలాన్ని అతణ్ణిగూడా పరిచయంచేశాడు హెడ్‌మాస్టరు.

"ఇతను మిస్టర్ గోపాలకృష్ణ. ఇంగ్లీషు అసిస్టెంట్" అన్నాడు హెడ్‌మాస్టరు. గోపాలకృష్ణవైపు తిరిగి "ఈమె మనక్రొత్త టీచరు మిస్. రాధారాణి."

గోపాలకృష్ణ ఆమెవైపు పరీక్షగా చూచాడు. ఆమె సిగ్గుతో తలవాల్చేసింది.

'టీచర్ రాధారాణిలో కాలేజిస్టూడెంట్ రాధారాణి లీలామాత్రంగా కనబడుతూంది. కాని, పూర్తిగా పోలికలేవు, ఈరాధారాణికి ముఖంపైన మశూచికపు గుంటలున్నాయి. శరీరం చామనచాయలోవుంది. వినయం, నమ్రత, సిగ్గు యీమెలో మూర్తీభవించి వున్నాయి. ఆ రాధారాణిలోని చలాకీతనం, ఆమెలోని మిడిసిపాటు, ఆగర్వపు చూపులు



చిత్రం: అర్జునుడికి పాశుపతాస్త్ర ప్రదానం.

యీ మెలో మచ్చుకైనా లేవు కాని ఆరాధా రాణి యీ మెలో రేఖామాత్రంగా కని పిస్తూంది.'

ఈ ఆలోచనలోనే క్లాసు కెళ్ళాడు గోపాలకృష్ణ. క్లాసులో పిల్లలకేమీ చెప్పకుండా కూర్చున్నాడు. ఆనాటి రాత్రి తనని కారులోకి లాగి కూర్చోబెట్టడం— పార్కులో కెళ్ళడం—అన్నీ గుర్తుకొస్తు న్నాయి.

ఛీ. ఛీ. ఆ రాధారాణి ఏ భవనంలోనో హాయిగా విహరిస్తూంటుంది మత్తెక్కిన యౌవ్వనంతో, వేలెత్తిచూపలేని సౌంద ర్యంతో, మితిమీరిన సౌభాగ్యంతో తుల తూగుతూంటుంది. ఈ రాధారాణి పొట్ట చేత బట్టుకు వచ్చిన రాధారాణి, ఆ రాధారాణి గాదు" అనుకుంటూ కూర్చుని వున్నాడు స్టాఫ్‌రూంలో ఒంటరిగా.

"ఏమండీ, గోపాలకృష్ణ గారూ!"

సన్నని, మంధుర కంఠస్వరం తన ఆలోచన లకి భంగం కలిగించింది వెనుదిరిగి చూడక మునుపే ముందుకువచ్చి నిల్చుంది క్రొత్త ఉపాధ్యాయిని.

"కూర్చోండి" అన్నాడు గోపాలకృష్ణ కుర్చీ చూపిస్తూ.

"ఏమండీ, నేను జ్ఞాపకమున్నానా?"

"లేకేం రాధారాణిగారూ? అప్పట్నుంచీ అదే ఆలోచిస్తున్నాను. సరేగాని, మీ కీ మహాచిక మెప్పుడువచ్చిందీ?"

"రెండేళ్ళయింది. దీనితో యిలా అయి పోయాను. అప్పుడే మానాన్న చని పోయాడు." రాధారాణికి కళ్ళనిండా నీళ్లు తిరిగాయి

ఇంతిసేపు ఆ రూములో ఎవ్వరూ లేరు. ఆ సమయంలో తెలుగు మాష్టారు ప్రవేశించి వీళ్ళని చూచి బిటాలున వెనక్కెళ్ళాడు.

"వూరోక్కండి రాధారాణిగారూ! జరిగి పోయినదానికి విచారించి ఏం లాభం?— సరే, మీ ఆస్తిపాస్తు లేమైపోయాయి. ఈ వుద్యోగానికి వచ్చారేం?"

"మా నాన్న దేశమంతా అప్పులుచేసి పోయాడు, చనిపోయిన తక్షణం అప్పుల వాళ్ళొచ్చి ఎవరెవరికి రావలసింది వాళ్ళు స్వాధీనపరచుకున్నారు మా అమ్మ నాన్న కంటే రెండు నెలలు ముందే చనిపోయింది ఇక నాకు 'నా' అన్నవాళ్ళెవ్వరూ లేకుండా పోయారు ఆస్తి పోవడంతో బంధువులంతా తప్పుకున్నారు జీవనాధారం లేక బి. ఇడి. చదివేను జీవితమంటే ఏమిటో యిన్నాళ్లకు తెలుసుకున్నాను.

గోపాలకృష్ణ నెమ్మదిగా నవ్వుకున్నాడు.

"మీకు నవ్వొస్తూంది గోపాలకృష్ణ గారూ ఇప్పటికే నన్ను చూచి అందరూ నవ్వారు ఆ రోజుల్లో నా అందాన్ని చూచి అసూయపడ్డ వాళ్ళందరికీ యిప్పుడు సంతోషంగా వుంది. నిజం చెప్పాలంటే, నాకు ఆస్తి పోయిందనుకున్నా దిగులేదు. నా అందమిలా అయిపోయిందనే దిగులుతో చస్తున్నాను," అంది రాధారాణి.

"క్షమించండి రాధారాణిగారూ! మిమ్మల్ని కష్టపెట్టాలని నవ్వలేదు. కాని ఆరోజు పార్కులోని సంఘటన జ్ఞాపక మొచ్చి నవ్వాను," అన్నాడు గోపాలకృష్ణ పశ్చాత్తాప పడ్తూ.

"మీకిప్పుడు జ్ఞాపకమొచ్చింది కాని, నాకు మశూచిక మొచ్చింది మొదలు యీనాటివరకూ ప్రతినిమిషంలోనూ ఆ సంఘటన నా గుండెల్ని పిండుతూంటుంది గోపాలకృష్ణ గారూ "

స్కూలు గంట కొట్టారు తరవాత పీరి

యడుకు క్లాసు కెళ్ళేందుకు లేచాడు గోపాల కృష్ణ. రాధారాణి వెళ్ళి హెడ్‌మాస్టరు రూములో కూర్చుంది.

రెండురోజుల తర్వాత రాధారాణి గోపాలకృష్ణవద్దకు వచ్చి "నాకిక్కడేమీ ప్రొద్దుపోవడం లేదండీ. తెలిసినవాళ్ళు గూడా ఎవ్వరూ లేరు. కొస్త మీ ఆవిడని పరిచయంచేస్తారూ?" అంది ప్రాధేయ పూర్వకంగా.

గోపాలకృష్ణ గట్టిగా నవ్వేశాడు.

"ఇంకా నాకో ఆవిడంటూ ఎవరూ లేరండీ. హోటలు భోజనం, రూము నిద్ర," అంటూ క్లాసు కెళ్ళిపోయాడు.

* * *

తెలుగుమాస్టరు నరసింహశాస్త్రి రాధారాణినిగురించి ఆరాలుతీయడం ప్రారంభించాడు. ఆమె కులం, గోత్రం అన్నీ బాగున్నాయని తెలుసుకున్నాడు. ఇక తన్ను వివాహమాడేందుకు ఆమె అంగీకారమే తరువాయి—

'అయినా తనకేం. నిక్షేపంలాంటివాడు. ఒకటోతేదీకి కరక్టుగా ఖంగున నట్టింట్లో మ్రోగే జీతపు రూపాయలు, దేవిడీలాంటి యిల్లు,అయిదెకరాల మాగాణీ...ఎటొచ్చీ తన కుండే ఆ ఒక్క మచ్చ...ఆ వెధవ భార్యముండ లేచిపోవడ మొక్కటే...దీనికింతగా ఆ అమ్మాయిగూడా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. ఈ కాలంలో ఎందరు లేచిపోవడం లేదు? అయినా అది ఇప్పుడు పరిపాటై పోయింది. ఇక అది లేచిపోయినా తను యిలా మడిగట్టుక్కూర్చుంటే ఎలా?'

తెలుగు మాస్టారు రాత్రి భోంచేసి అలా హెడ్ మాస్టరుగారింటివైపు వెళ్ళాడు. హెడ్‌మాస్టరు కుర్చీ చూపించి కూర్చో మన్నారు. తెలుగుమాస్టారు తన కష్టసుఖాలు యింట్లో తను వంటచేసే బాధ, తన ఆరోగ్యము, అన్నీ ఏకరువు పెడుతూ "త్వరగా ఓ పిల్లనుచూచి కట్టుకోంటే నాకు శాంతి లభించదండీ. పెద్దలు—మీరీ భారంవహించి నన్నో ఇంటివాణ్ణి చేసేందుకు కంకణం కట్టుకోండి" అని దీనాతిదీనుడై, ముకుళిత హస్తుడై, ప్రార్థించాడు పరంధామయ్యను.

హెడ్‌మాస్టరుకు పెళ్ళిళ్ళు జరిపించడ మన్నా, పెళ్ళిలో పెత్తనం వహించడ మన్నా మహా సరదా. "ఒక ఇల్లు నిలబెట్టేందుకు నూరబద్ధా లేమిటి ... వెధవది ... లక్ష అబద్ధాలయినా నిరాటంకంగా ఆడేయవచ్చు ...ఎలాగయినా పెండ్లి జరిగేట్లు చూడాలి గాని" అన్నాడు పరంధామయ్య యీమధ్య జరిగిన ఓ వివాహ సందర్భములో.

తెలుగుమాస్టారి యీ ప్రార్థనతో పరంధామయ్య మనసు కరిగింది; కళ్ళు మూసుకుని ఓ రెండునిమిషాలు ఆలోచించి—

"నీ ఎరికలో ఎవరయినా కన్యలున్నారూ?" అన్నాడు పరంధామయ్య.

"లేకేమండి. ఉన్నారు. కానీ...అతక దేమో?"

"ఆ. అతకడ మేమిటయ్యా......ఎవరు? చెప్పు?"

తెలుగు మాస్టారికి కొద్దిగా భయంపుట్టింది తీరా అసలుపేరు చెప్పాక ఆయనకేమి కోపం వస్తుందో! "పో. పోవయ్యా. దౌర్భాగ్యుడా. ఒక పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేక పొయ్యావ్. మళ్ళీ పెళ్ళట...పెళ్ళి... అందులోనూ చదువుకొంది. నీకంటె ఎక్కువ సంపాయించే పిల్లాయె. వెర్రి వెర్రి ఆలోచనల్చెయ్యక గుట్టుగా వుండు" అని చీవాట్లేస్తాడేమో.

"చెప్పవయ్యా. ఎవరేమిటి ఆ అమ్మాయి?" మళ్ళీ అడిగాడు పరంధామయ్య.

"తమకు కోపం రాదుగదా—మరి...మన క్రొత్త టీచరుందే — ఆమెను చేసుకోవాలనుందండీ."

పరంధామయ్య ఆశ్చర్యంగా చూచాడు తెలుగు మాస్టారివంక. మాస్టారు గుటకలు మ్రింగడం ప్రారంభించాడు.

"అయితే. ఆమె ఒప్పుకుందా?"

"అబ్బే. యీ విషయం నేనింకా కదప లేదుగా ఆమెవద్ద."

"ఆమె చేసుకుంటుందని నమ్మకముందా అని. తీరా అడిగిన తర్వాత ఆమె నిరాకరిస్తే నా గౌరవ ముంటుందీ?"

"అవునవున్లేండి. కాని మీ రడిగేకంటె వేరె మధ్యవర్తులద్వారా జరిపించడం మంచిది గదండీ."

"ఆమెతో చనువుగా మాట్లాడే వాళ్ళెవరున్నారండీ?"

"ఆ గోపాలకృష్ణ లేడూ. అతడూ, ఈమె ఒకచోట చదువుకున్నారటండీ. వచ్చిన రోజే వాళ్ళు గుసగుస లాడుకుంటున్నారండీ ఉపాధ్యాయుల గదిలో..."

"అయితే నే కనుక్కుంటాలే. నువ్వెళ్లు" అని పడుకు నేందు కెళ్ళాడు పరంధామయ్య తెలుగుమాస్టారు తిన్నగా ఇంటిముఖం పట్టాడు.

* * *

రాధారాణిని తెలుగుమాస్టరు పెళ్ళాడా లనుకుంటున్నాడని రాధారాణికంటే ముందుగా విద్యార్థులకీ, ఉపాధ్యాయులకీ, వూళ్ళో వాళ్ళకి తెలిసిపోయింది. తను దారిన వెళుతూంటే వూళ్ళో వాళ్లు తనని చూపిస్తూ ఏదో గుసగుస లాడ్తూంటే ఆశ్చర్యపోయింది రాధారాణి. క్లాసులో పిల్లల ముసి ముసి నవ్వుల్లోని కొంటె కొయతనాన్ని కనిపెట్టేసింది. తోటి ఉపాధ్యాయులందరూ ఒకవిధంగా తనవైపు చూచి ముఖం త్రిప్పుకెళ్ళిపోతూంటే తన వంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్లయింది గోపాలకృష్ణ ఒంటరిగా వుండే సమయం కనిపెట్టి "ఏమిటీ వింతవైఖరి?" అని అడిగింది రాధారాణి.

అప్పటివరకూ హెడ్ మాస్టరు తనపై మోపిన భారాన్ని ఎలా బైటపెట్టడమా అని ఆలోచిస్తున్న గోపాలకృష్ణకు చక్కటి సమయం దొరికింది.

"రాధారాణిగారూ. మీకూ నాకూ పరీక్షా సమయం వచ్చింది. ఇప్పటివరకు కావిషయాన్ని ఎలా బైటపెట్టడమా అని ఆలోచిస్తున్నాను."

"చెప్పండి. ఏమిటది?"

"ఏమీ లేదు. 'తెలుగు మాస్టార్ని మీరు వివాహమాడేందుకు అంగీకరిస్తారా' అని తెలుసుకోమని నన్ను నియమించాడు హెడ్

పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డు పెన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభ నష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపుడు చేయడమగును. వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Swamy Satyanarain, Raj Jyotishi,. (WPA) Phagwara. (Pb)

★ రాధారాణి ★

మాస్టరు. ఈవిషయం అప్పుడే విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ తెలిసిపోయింది. పైగా యీ వూరు అటు బస్తీగాదు, యిటు చిన్న పల్లెగాదు గాబట్టి వూళ్లో అప్పుడే మీమీద గుసగుసలు ప్రారంభమైనాయి."

రాధారాణితల గిర్రున తిరిగిపోయింది. "వీళ్లు మానవులేనా? యిరవై రెండేళ్ళయినా నిండని నేను ఆ ముసలాడ్ని పెళ్లాడాలా? ఆ పిలకా, ఆ నస్యం...ఆయనా,... నేను వీళ్ళకళ్ళకి అంత నీచంగా అగుపిస్తున్నానా? ఆడదంటే వీళ్లి కింత చులకనా?... ఆ పాడు మశూచికం నాకే రావాలా?..." ఏడుస్తూ పడిపోయింది. చాలాసేపు వరకూ లేవలేదు. విద్యార్థులంతా గుమిగూడారు. సైన్సు టీచరు వచ్చి అందర్నీ వెలుపలికి వెళ్ళమని రాధారాణి ముఖంమీద చల్లటి నీళ్లు చల్లాడు. కొంచెం సేపటికి లేచి కూర్చుంది.

ఆ రోజు జ్వరం బాగా వచ్చింది. ఇంట్లో తనకి తోడెవ్వరూ లేరు. అప్పుడప్పుడూ ఫిఫ్త్ ఫారం చదివే పార్వతి వచ్చి సహాయం చేస్తూంది.

తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు,అది తాత్కాలికము! మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును, ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).



తెలుగు మాస్టారు గోపాలకృష్ణని పీక్కు తినడం ప్రారంభించాడు. "గోపాలకృష్ణ గారూ, నన్ను పాలలో ముంచినా నీటిలో ముంచినా మీరే! మీమీద పంచరత్నాలు వ్రాస్తాను. జరీకండువా బహుమతిచ్చుకుంటాను. నా ఆశలన్నీ మీ మీద నే వున్నాయి. మీరు తలచుకుని పట్టుబడితే ఆమె నాదైపోయిందన్న మాటే" ఇలా అంటూ వెంటబడుతున్నాడు.

వారంరోజుల్లో రాధారాణికి జ్వరం నయమై స్కూలుకు రావడం ప్రారంభించింది. హెడ్‌మాస్టరు తెలుగు మాస్టారితో మాట్లాడి ఆయనింట్లో ఉపాధ్యాయు లందరికి ఓటీపార్టీ యివ్వమని చెప్పాడు. డబ్బు ఖర్చుతోగూడిన ఏ పనయినా, యీ టీపార్టీ వలన రాధారాణితో తనకు కొంతగాకపోతే కొంతయినా సన్నిహిత మేర్పడుతుందనీ, కాబోయే పెండ్లి కదే ముఖ్యమనీ, తెలుగు మాస్టా రిందుకు వప్పుకున్నాడు.

టీపార్టీకి వెళ్లడం రాధారాణికి సుతరామూ యిష్టం లేకపోయినా, పరంధామయ్య పట్టిన పట్టువల్ల వెళ్ళక తప్పిందిగాదు.

తెలుగు మాస్టారింట్లో రాధారాణికి ఎదురుగా గోడమీద ఓ ఫోటో కన్పించింది. ఆ ఫోటో సగానికి కత్తిరించబడి వుంది. మిగతా సగంలో తెలుగు మాస్టారు కుర్చీ మీద కూర్చుని వున్నాడు. కుర్చీమీద మరో చెయ్యి కన్పిస్తూంది. ఆ చేతికి గాజులున్నాయి. మిగతాభాగం మాత్రం కత్తిరించబడివుంది. రాధారాణికి ఓ చిలిపి ఆలోచన పుట్టింది.

"మాస్టారూ! ఆ ఫోటో ఎవరిదండీ, బాగుందే" అంది రాధారాణి.

"అది నాదేనండీ. మరి నన్ను అంతా పెద్దవాణ్ణి అనుకుంటారేగాని, ఆ ఫోటో గ్రాఫు మాడండీ. నే నెంత చిన్నవాణ్ణో. రెండేళ్ళక్రితం నే నచ్చం అలాగే వుండేవాణ్ణి." అంటూ ఫోటోను పై కండువాతో తుడిచి ఆమెచేతి కిచ్చాడు.

ఆమె నిదానంగా చూచి "మరి. మీ కుర్చీమీదవుండే యీ చెయ్యి ఎవరిదండీ?" అంది.

"అదా...అది మా తమ్ముడిది లేచని పోయాడీ మధ్యనే. ఉత్త దొంగవెధవ..." అన్నాడు కంగారుగా. అసలతనికి తమ్ముడే లేడు. అది తన లేచిపోయిన భార్యతాలూకు చెయ్యి అని చెబితే ఏమైనా వుందీ!!

"మీ తమ్ముడు గాజులు తొడిగే వారటండీ!"

అందరి నవ్వులతో మారుమోగి నట్లయింది యిల్లంతా. పరంధామయ్య చేతులు నెత్తిమీద పెట్టుకున్నాడు. త్వరగాలేచి "ఇక వెళ్దామా, ప్రొద్దు బోయింది." అన్నాడు పరంధామయ్య. అంతా లేచారు. తెలుగు మాస్టారికి 'థాంక్సు' చెప్పి వెళ్ళారు.

నాలుగురోజుల తర్వాత హెడ్‌మాస్టరే స్వయంగా ఎత్తాడు పెళ్ళిసంగతి. ఆమె "ససేమిరా. వల్లకాదు" అంది "చూడమ్మాయ్. నీవు చిన్నపిల్లవుకాదు. మనమంతా కడుపు చేతపట్టుకు వచ్చిన వాళ్ళం. అందులోను నీవు స్త్రీవి. మనదేశంలో స్త్రీ ఎప్పుడూ ఒకరిమీద ఆధారపడి వుండాల్సిందే. ఈ సమయంలో నీకు అండగా మగాడు లేకపోవడం విచారకరం. నన్ను తప్పుగా అర్థం చేసుకోకు. నీకు తండ్రిలాంటి వాడిని. తెలుగు మాస్టరు యీ వూళ్లో అందరికీ తల్లో నాలుకలాంటివాడు. ఆస్తివుంది. మాట నెగ్గించుకోగల సామర్థ్యవుంది. అలాంటివాడిని కాదనడం శ్రేయస్కరంగాదు..."

"క్షమించండి. ఈ ఆస్తిపాస్తుల విషయం నాకు చెప్పక్కర్లేదు. కాలం కలిసిరాక యిలా అయ్యానుగాని, లేకుంటే యీ తెలుగు మాస్టార్లాంటివాళ్లను వంద మందిని పోషించగలిగి వుండేదాన్ని—"

"ఆ విషయాలన్నీ నాకు తెలుసునమ్మాయ్. జరిగిపోయినదానికి వగచి ఏం లాభం చెప్పు. నీ వొకప్పుడెంతో అందగత్తెవని నాకు తెలుసు. కాని నీవు యిప్పుడిల్లా అయ్యావంటే ఎవరిది తప్పు?...ఖర్మ... అందుకు తగ్గట్టే మనము నడచుకోవాలి... కానీ, ఒక్కమాటమ్మాయ్ నీయిప్పటి అందచందాల మీద నీకు పెద్ద అభిప్రాయాలున్నాయేమో...అవేం ఏం పెట్టుకోకు... నిజం చెప్పాల్నొస్తే యింతకంటే గొప్ప వరుడు నీకు దొరకడు..."

"షటప్" గట్టిగా అరచింది రాధారాణి వచ్చే ఏడుపు నాపుకోనేందుకు ప్రయత్నించింది. కాని ఆపుకోలేక ఏడ్చింది. ముఖం జేవురించింది. ఆ కోపంలో ముఖం మరీ అసహ్యమై పోయింది. ప్రక్కకు తిరిగి నిల్చుంది. ఎదుట అద్దాలబీరువాలో తన ముఖం కనిపించింది. భరించలేకపోయింది. "ఏమిటే! తన ముఖం యింత వికృతంగా వుందే?" కళ్లుగట్టిగా మూసుకుంది.

రాధారాణికి వచ్చిన కోపానికి, ఆమె షటప్ అన్నందుకు హెడ్‌మాస్టరు భయపడలేదు. కాని జాలితో నిండిపోయింది ఆయన హృదయం. ఆయన అంత కఠినంగా మాట్లాడడంటే ఆమెమీద ద్వేషభావంతోనూ కాదు, లేక ఆమె మనసు నొప్పించాలనీ కాదు. కాని, ఒక పెండ్లి జరిపించాలనే ఆతురతతోనే అలా అన్నాడు. "తన కూతుర్నే ఎవరైనా యిలా అడిగుంటే..."

★ రాధారాణి ★

అన్నిటినీ ఆత్మ విమర్శన చేసుకునే అలా ప్రవర్తించాడు పరంధామయ్య.

"నిజం చెప్పాలంటే ... యింతకంటే మంచివరుడు నీకు దొరకడు" అన్నమాటలు యింకా ఆమెలో ప్రతిధ్వనిస్తున్నాయ్. అద్దంలో ముఖం చూచుకున్న రాధారాణికి తనమీద తనకే నమ్మకం పోయింది. "నేనింత వికృతంగా వున్నానా? నేనంటే పిల్లలంతా భయపడుతున్నారా? నాకు యింతకంటే మంచిభర్త దొరకడా?"... కన్నీరు కారుస్తూండే రాధారాణికి దగ్గరగా వచ్చిన పరంధామయ్య పాదాలు కనుపించాయి.

"పాపం ... పెద్దవాణ్ణి పటప్ అన్నాను. ఏమనుకున్నాడో"... తటాలున ఆయన పాదాలు పట్టుకుని "క్షమించండి. ఆవేశంలో ఏదో అన్నాను" అంది.

"పరవాలేదమ్మాయ్ నాకూ బిడ్డలున్నారు. నా బిడ్డల్లో నీవూ ఒకదానివి. నీవేమన్నా నాకేం బాధలేదమ్మా" అన్నాడు ప్రేమగా.

"అయితే నీవు అంగీకరించావా అమ్మాయ్?" అడిగాడు పరంధామయ్య కొంచెం ఆగి.

రాధారాణి మౌనంగా, నిశ్చలంగా వుండిపోయింది.

మౌనంగా అంగీకారసూచకంగా భావించాడు పరంధామయ్య.

* * *

'రాధారాణి తెలుగు మాస్టార్ని పెళ్ళాడేందుకంగీకరించింది' అనే వార్త క్షణంలో అందరికీ తెలిసిపోయింది.

తెలుగు మాస్టారు రెక్కలుగట్టుకు వచ్చి వాలాడు పరంధామయ్య వద్ద.

"ముహూర్తం చూడండి మాస్టారూ?" అన్నాడు చుట్ట వెలిగించి పరంధామయ్య.

"మాచే వుంచానండి. సరిగ్గా నాలుగోనాడు శుక్రవారం నాటికి బహు భేషుగ్గా వుంది. దేవాలయంలో గానిచ్చేద్దాం" అన్నాడు ఆత్రంతో.

"ఈకొద్ది వ్యవధిలో నీవు అన్నీ సమకూర్చుకోగలవూ?"

"ఓ..." అన్నాడు ధీమాగా. ఎలాగైనా పెండ్లే అతడికావలసింది.

గోపాలకృష్ణ యీ విషయం మొదట నమ్మలేకపోయాడు. కాని ముహూర్తం విషయంగూడా తెలిసిన తర్వాత ఏమిటో అయోమయంలోపడిపోయాడు. మళ్ళీ పాత కథలన్నీ స్మృతిలోకి వచ్చాయి. ఎక్కడి రాధారాణి—ఎక్కడి తెలుగు మాస్టరు—అందాల రాధారాణి—ఆమె ప్రేమకోసం పడిగాపులు కాచిన కాలేజి విద్యార్థులూ—రెండో పెళ్ళి తెలుగు మాస్టరూ—యివన్నీ ఆలోచిస్తూ అతని బుర్ర తిరిగిపోయింది. ఇంకా యీ వూళ్ళో వుండి ఆ పెళ్ళి చూడకూడదనుకుని స్కూలుకు శెలవు పెట్టి వెళ్ళాడు. వెళ్ళేముందు రాధారాణికి ఓ ఉత్తరం వ్రాశాడు.

"మీరు యింతటి హీనానికి పాల్పడతారనుకోలేదు. పురుషుడి అండ లేకపోయినంత మాత్రాన మీరు యిప్పుడు పడే కష్టాలేమీ లేవు. కాని మీరు మీ జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకున్నారని తెలుసుకోండి. మీ వివాహాన్ని చూడలేకనే వెళ్తున్నాను. మళ్ళీ వచ్చేది గూడా లేదు. పోస్టులోనే రాజీనామాను పంపుతున్నాను. శెలవు...శీఘ్రమే సంతాన ప్రాప్తిరస్తు..."

అని వ్రాసి ఓ కుర్రాడిచేత పంపాడు రాధారాణికి.

ఆ ఉత్తరం చదువుకున్న రాధారాణికి కడుపులో చెయ్యిపెట్టి దేవినట్లయింది. తన అస్థిపంజరం తనముందు నాట్యంచేస్తూంది. దాని ప్రక్కనే పూర్వపు రాధారాణి తెల్లటి గుడ్డల్లో మెరిసిపోతూ ప్రత్యక్షమైంది. పూర్వపు రాధారాణి వెక్కిరిస్తూ కిలకిలా నవ్వుతూంది. రాధారాణికి ముచ్చెమటలు పోశాయి. కెవ్వుమని కేకేసి పడిపోయింది. మర్నాటికి వళ్లు తెలిసి కళ్లు తెరిచేప్పటికి పరంధామయ్య, ఆయన భార్య వచ్చి కూర్చుని వున్నారు. అయోమయంగా వాళ్ళవేపు చూస్తూ కూర్చుంది రాధారాణి. భార్యతో ఆమెను కనిపెట్టి వుండమని చెప్పి బయటికెళ్ళాడు పరంధామయ్య.

* * * *

వేణుగోపాలస్వామి ఆలయంలో పెళ్ళి పందిట్లో మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి. వధువు రాధారాణి, వరుడు నరసింహశాస్త్రి పీటలపై కూర్చున్నారు. రాధారాణి, గుడ్లప్పజెప్పి పెండ్లికుమారుడివైపూ, పురోహితుడివైపూ చూస్తూంది. సకాలంలో తెలుగుమాస్టారు వణికేచేతుల్తో రాధారాణి మెడలో మాంగల్యధారణ చేశాడు...స్కూలు ప్యూను ఓకవరు తెచ్చి పరంధామయ్య చేతిలోపెట్టి వెళ్ళాడు పరంధామయ్య దాన్లోని ఉత్తరాన్ని చదివి పెండ్లికొడుకు చెవిలో వూదాడు "గోపాలకృష్ణ రాజీనామా చేసాడు" అని. ఆమాటలు రాధారాణి గూడా విన్నది.

రాధారాణి గుండె దడదడలాడింది. శరీరం కంపించింది. తత్క్షణం మైకం కమ్మి క్రిందబడిపోయింది. అయిదు నిమిషాల్లో కళ్ళు తెరచింది. గుడ్లు పెద్దవిచేసి చుట్టూ అందరివంకా చూచింది.

చేతికుండే వేళ్లన్నిటినీ లెక్కబెట్టింది.

"మాస్టారూ ద్రౌపతికి భర్తలెందరు?" అని ప్రశ్నించింది పెండ్లికొడుకుని.

బిక్కమొగం పెట్టాడు తెలుగు మాస్టరు పెండ్లికి వచ్చిన వాళ్లకిదంతా ఆశ్చర్యంగా వుంది.

"చెప్పవయ్యా పండితుడూ...హు... ద్రౌపతికెందరు భర్తలో తెలియనివాడికి పెళ్ళాం గావాలీ!...పెళ్ళాం!! చూడండయ్యా మీరు చెప్పండి న్యాయం. ద్రౌపదికి భర్తలెందరో తెలీనివాడా నాభర్త" అంది ఏడుస్తూ అక్కడ కూర్చున్న పెద్దలతో.

"చెప్పండీ పరవాలేదు" అన్నాడు పరంధామయ్య పెళ్లికొడుకుతో.

"అయిదుగురు" అన్నాడు నెమ్మదిగా తెలుగు మాస్టరు.

"అయిదుగురా...కరెక్టు...నీకు సెంట్ పర్సెంట్...సరే...యీ తాళి కట్టిందెవరు? అంది తన మెళ్ళో అప్పుడే కట్టబడిన మాంగల్యాన్ని చూపుతూ.

"నేను"

"నువ్వా...హా...హా...హా...నువ్వా"

అంతే పరంధామయ్య డాక్టర్ని వెంటబెట్టుకువచ్చాడు. డాక్టరుపరీక్షించి "ఈమెను త్వరగా విశాఖపట్నం తీసుకెళ్ళి పిచ్చాసుపత్రిలో చేర్చండి. పిచ్చి యింకా ముదరలేదు. త్వరగానే కుదరవచ్చు" అన్నాడు. తెలుగు మాస్టరు లబోదిబోమని ఏడ్చాడు. ★